2029 నుంచి జమిలి ఎన్నికలు!

- ప్రతిపాదించనున్న లా కమిషన్
- ఏకకాల ఎన్నికలపై రాజ్యాంగంలో కొత్త చాప్టర్ చేర్చే యోచన

న్యూఢిల్లీ: దేశంలో 2029 నుంచి లోక్‌సభతోపాటే అన్ని రాష్ట్రాల శాసనసభలు, స్థానిక సంస్థలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వానికి లా కమిషన్ సిఫారసు చేయనున్నట్టు విశ్వసనీయ వర్గాలు గురువారం వెల్లడించాయి. ఈ మేరకు రాజ్యాంగంలో ఒకే దేశం.. ఒకే ఎన్నికలు అనే కొత్త అధ్యాయాన్ని చేర్చేందుకు ప్రతిపాదనలు చేసే ఆలోచనలో ఉన్నట్టు తెలిసింది. 2029లో మే, జూన్ మధ్య కాలంలో ఎన్నికలు నిర్వహించేలా లా కమిషన్ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దీని ప్రకారం దేశవ్యాప్తంగా లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలు, స్థానిక సంస్థలకు ఏకకాలంలో ఎన్నికలు జరుగుతాయని సంబంధిత వర్గాలు బుధవారం తెలిపాయి. లా కమిషన్‌తో పాటు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఒక ఉన్నత స్థాయి కమిటీ కూడా రాజ్యాంగాన్ని, ప్రస్తుత చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను మార్చటం ద్వారా జమిలి ఎన్నికలు ఎలా నిర్వహించవచ్చో అనే దానిపై నివేదికను రూపొందిస్తున్నది. ఈ ఏడాది మేలో లోక్‌సభతో పాటు ఐదు అసెంబ్లీలకు ఎన్నికలు జరిగే అవకాశమున్నది. మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్ రాష్ట్రాల్లో ఈ ఏడాది చివర్లో ఎన్నికలు జరుగనున్నాయి. వచ్చే ఏడాది బీహార్, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండగా.. అస్సాం, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళకు 2026లో, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, మణిపూర్‌లకు 2027లో ఎన్నికలు జరగనున్నాయి. త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్, కర్ణాటక, మిజోరం, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రాల్లో 2028లో ఎన్నికలు జరగవచ్చు. జస్టిస్ రీతురాజ్ అవస్థీ ఆధ్వర్యంలోని లా కమిషన్, ఏకకాల ఎన్నికలపై కొత్త అధ్యాయాన్ని చేర్చటానికి రాజ్యాంగ సవరణకు సిఫారసు చేయవచ్చని సమాచారం.

ఏప్రిల్ నాటికి రాజ్యసభలో ఎన్‌డీఏకు మెజారిటీ!

న్యూఢిల్లీ: బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు రాజ్యసభలో ఏప్రిల్ నాటికి ఆధిక్యం వచ్చే అవకాశం కనిపిస్తున్నది. కొత్తగా గెలిచిన సభ్యులు, రాష్ట్రపతి నామినేటెడ్ విభాగంలో నియమించే ఆరుగురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మెజారిటీకి అవసరమైన సభ్యులు ఈ కూటమిలో ఉంటారు. రాజ్యసభలో 245 మంది సభ్యులు ఉంటారు. బిల్లులకు ఆమోదం లభించాలంటే కనీసం 123 మంది సభ్యులు అవసరం. ప్రస్తుతం ఎన్డీయేకు 113 మంది సభ్యులు ఉన్నారు. కీలక బిల్లులకు ఆమోదం లభించాలంటే రాజ్యసభలో మెజారిటీ తప్పనిసరి. అందుకే ప్రభుత్వం ఇప్పటి వరకు బీజేడీ, వైకాపాల మద్దతు తీసుకుని కొన్ని బిల్లులను ఆమోదించుకుంది.

ప్రైవేటు చికిత్స అంత ఖరీదేం?

మొదటిపేజీ తరువాయి...

ప్రకారం వైద్య చికిత్స ధరలను నియంత్రించాలని పిటిషన్‌లో కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన సేవల చార్జీలను అన్ని దవాఖానాల్లో స్థానిక భాషలతో పాటు ఇంగ్లిష్‌లో కూడా ప్రదర్శించాలన్న నిబంధన ఎప్పటి నుంచో ఉన్నది. దీన్ని అమలులో కేంద్రం వైఫల్యాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టింది. రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు జరిపి, కేంద్రం నిర్ణయించిన మేరకు ప్రతి చికిత్స ధర ఉండాలని స్పష్టంచేసింది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాల సహకారం కోరుతూ ఎన్నో ఉత్తరప్రత్యుత్తరాలు జరిపినప్పటికీ వారి నుంచి ఎలాంటి స్పందన రాలేదని కేంద్రం సుప్రీం కోర్టుకు తెలిపింది. దీనిపై స్పందించిన సుప్రీం పౌరుల ప్రాథమిక హక్కు అయిన 'అందరికీ అందుబాటు ధరలో వైద్యాన్ని' అందించటం కేంద్రం బాధ్యత అని తేల్చిచెప్పింది. నెలలోపు ప్రామాణికమైన ధరలను నిర్ణయించాలని కేంద్ర ఆరోగ్య కార్యదర్శిని కోరింది. ఒక వేళ ఈ విషయంలో కేంద్రం విఫలమైతే సీజీహెచ్ఎస్‌లో సూచించిన ధరలనే అమలు చేయాలన్న పిటిషనర్ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుంటామన్నది.

హిమాచల్‌లో హైడ్రామా

పతనం అంచున కాంగ్రెస్ ప్రభుత్వం!

మంత్రి విక్రమాదిత్యసింగ్ రాజీనామా.. అనంతరం వెనక్కి

కాంగ్రెస్ మెజార్టీ నిరూపించుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్

సిమ్లాకు ముగ్గురు పరిశీలకులను పంపిన కాంగ్రెస్ అధిష్ఠానం

ప్రతిపక్ష ఎమ్మెల్యేలను బయటకు పంపి.. బడ్జెట్‌కు ఆమోదం

సిమ్లా, ఫిబ్రవరి 28: రాజ్యసభ ఎన్నికలు హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రెస్ సర్కార్‌ను సంక్షోభంలోకి నెట్టాయి. సీఎం సుఖ్విందర్ సింగ్ సుఖు నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ మెజార్టీ కోల్పోయిందని, విశ్వాస పరీక్ష ఎదుర్కోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ప్రస్తుత సర్కార్‌పై అసంతృప్తి వ్యక్తం చేస్తూ మంత్రి విక్రమాదిత్య సింగ్ బుధవారం ఉదయం తన పదవికి రాజీనామా చేశారు. దీంతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. అయితే కాంగ్రెస్ అధిష్ఠానం పంపిన పరిశీలకులతో చర్చల అనంతరం తన రాజీనామాను విక్రమాదిత్య వెనక్కి తీసుకున్నారు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ సర్కార్ బుధవారం అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా అసెంబ్లీలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి.'జై శ్రీరామ్..బన్ గయా కామ్..'అంటూ కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యేలు, ముగ్గురు స్వతంత్రులు సభలో అడుగుపెట్టారు. మంగళవారం రాజ్యసభ ఎన్నికల్లో ఓటేసిన తర్వాత ఈ 9మంది ఎమ్మెల్యేలు హర్యానాలోని పంచకులకు వెళ్లిపోయారు. అక్కడ వారికి బీజేపీ సర్కార్ కట్టుదిట్టమైన భద్రత కల్పించటం గమనార్హం. బుధవారం బడ్జెట్ సమావేశాల్లో పాల్గొనేందుకు హెలికాప్టర్‌లో సిమ్లాకు చేరుకున్నారు. బడ్జెట్ సమావేశాల్ని బీజేపీ ఎమ్మెల్యేలు అడ్డుకున్నారు. ముందు కాంగ్రెస్ సర్కార్ తన మెజార్టీ నిరూపించుకోవాలని బీజేపీ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. దీంతో సభలో గందరగోళ పరిస్థితి నెలకొంది.15 మంది బీజేపీ ఎమ్మెల్యేలను సభ నుంచి సస్పెండ్ చేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలను బయటకు పంపి.. రాష్ట్ర బడ్జెట్‌ను మూజువాణి పద్ధతిలో ఆమోదించారు. ఆ తర్వాత సభను స్పీకర్ నిరవధిక వాయిదా వేశారు. దీని కంటే ముందు బీజేపీ ఎమ్మెల్యేలు గవర్నర్ ప్రతాప్ శుక్లాను కలుసుకొని, కాంగ్రెస్ సర్కార్ మెజార్టీ నిరూపించుకోవాలని గవర్నర్‌ను కోరారు. మరికొద్ది రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరగబోతున్న తరుణంలో తాజా పరిణామాలు కాంగ్రెస్‌ను ఇరకాటంలో పడేశాయి.

సీఎం సుఖ్విందర్ సింగ్ సుఖు

మంత్రి విక్రమాదిత్య సింగ్

నష్ట నివారణ చర్యల్లో అధిష్ఠానం

ఆరుగురు ఎమ్మెల్యేలు బీజేపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటేయటంతో కాంగ్రెస్ అధిష్ఠానం ఉలిక్కిపడింది. వెంటనే నష్టనివారణ చర్యలకు దిగింది. సీఎం అసంతృప్తిగా ఉన్నారని చెబుతున్న ఆరుగురు ఎమ్మెల్యేలతో చర్చించేందుకు సీనియర్ నేతలు భూపిందర్ సింగ్ హుడా, డీకే శివకుమార్, భూపేశ్ బఘేల్‌లను సిమ్లాకు పంపింది. 68 స్థానాలున్న హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీకి 2022లో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్-40, బీజేపీ-25, స్వతంత్రులు-3 స్థానాలు గెలుచుకున్నారు. తాజాగా రాజ్యసభ ఎన్నికల్లో ఆరుగురు ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడటంతో కాంగ్రెస్ బలం 34కు తగ్గిందని సమాచారం.

రాజీనామా చేసేది లేదు

రాజకీయ సంక్షోభం నేపథ్యంలో సీఎం పదవికి సుఖ్విందర్ రాజీనామా చేయనున్నారనే వార్తలు గుప్పుమన్నాయి. అయితే వీటిని సుఖు ఖండించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ, తాను సీఎం పదవికి రాజీనామా చేయటం లేదన్నారు.

అఖిలేశ్ యాదవ్‌కు సీబీఐ సమన్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: ఎన్నికల వేళ సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు, యూపీ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్‌కు ఈడీ సమన్లు జారీ చేసింది. ఐదేళ్ల క్రితం నమోదైన అక్రమ మైనింగ్ కేసులో సాక్షిగా ఈ నెల 29న తమ ముందు హాజరు కావాలంటూ ఆదేశించింది. 2012-13లో అఖిలేశ్ యాదవ్ గనుల శాఖ మంత్రిగా స్వల్పకాలం పని చేసినప్పుడు ఈ-టెండర్ విధానాన్ని అతిక్రమించి నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ లీజులు మంజూరు చేశారని ఆరోపణ. ఒక పక్క గ్రీన్ ట్రిబ్యునల్ నిషేధం ఉన్నప్పటికీ 2012-16 మధ్య కాలంలో పలు గనుల లైసెన్స్‌లను అక్రమంగా రెన్యువల్ చేశారని అఖిలేశ్ ప్రభుత్వంపై వచ్చిన ఆరోపణలపై సీబీఐ విచారణ సాగిస్తున్నది. త్వరలో జరగనున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే తనను వేధించడానికి బీజేపీ ఈ నోటీసులు జారీ చేయించిందని అఖిలేశ్ ఆరోపించారు.

కవిత పిటిషన్‌పై విచారణ 13కి వాయిదా

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): మద్యం పాలసీ కేసులో ఈడీ విచారణను సవాల్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ వచ్చే నెల 13న చేపడుతామని సుప్రీంకోర్టు చెప్పింది. ఈ మేరకు బుధవారం సుప్రీంకోర్టు సమయం ముగియడంతో దీనిపై ప్రత్యేకంగా ప్రస్తావించిన ఎమ్మెల్సీ కవిత తరపు న్యాయవాది కపిల్ సిబల్ త్వరగా విచారణ జరుపాలని కోర్టును విజ్ఞప్తి చేశారు. దీంతో వచ్చే నెల 13న విచారిస్తామని కోర్టు తెలిపింది.

రాజీవ్ హత్యకేసులో దోషి మృతి

చెన్నై : రాజీవ్ హత్య కేసులో జీవిత కాల శిక్ష అనుభవించి విడుదలైన సంతాన్ బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. రాజీవ్ హత్య చేసిన కేసులో సంతాన్ 20 ఏళ్ల పాటు జైలు శిక్ష అనుభవించాడు. 2022లో సుప్రీం కోర్టు విడుదల చేసిన ఏడుగురిలో సంతాన్ ఒకడు. ఇతను శ్రీలంక జాతీయుడు. 1991 నుంచి సంతాన్ లివర్ సమస్యతో బాధపడుతున్నాడు. బుధవారం గుండెపోటు కారణంగా మృతి చెందినట్టు రాజీవ్‌గాంధీ ప్రభుత్వ దవాఖాన వైద్యులు తెలిపారు.

ఇస్రో రాకెట్‌కు చైనా జెండా!

వివాదంలో తమిళనాడు సర్కారు

చెన్నై: ఇస్రో స్పేస్ పోర్టు శంకుస్థాపన సందర్భంగా తమిళనాడు ప్రభుత్వం పత్రికల్లో ఇచ్చిన ఒక ప్రకటనలో దొర్లిన ఒక భారీ తప్పిదం ఆ ప్రభుత్వాన్ని తీవ్రంగా ఇరుకున పడేసింది. చైనా జెండాతో కూడిన రాకెట్‌ను ఆ ప్రకటనలో ఉంచడం తీవ్ర కలకలం సృష్టించింది. తూత్తుకూడి జిల్లా, కులశేఖర పట్టణం స్పేస్ పోర్టుకు ప్రధాని బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ దిన పత్రికలలో తమిళనాడు ప్రభుత్వం ఈ ప్రకటనలు వెలువరించింది. అయితే కంప్యూటర్ గ్రాఫిక్స్‌లో తయారు చేసిన ప్రకటనలో ప్రధాని మోదీ, సీఎం స్టాలిన్ చిత్రాల వెనుక ఉన్న ఇస్రో రాకెట్ చుట్టూ భారత జాతీయ జెండాకు బదులుగా చైనా జాతీయ జెండాను పెట్టడం వివాదానికి దారితీసింది. డీఎంకే ప్రభుత్వం అన్ని హద్దులు మీరిందని ప్రధాని మోదీ తీవ్రంగా మండిపడ్డారు.

పాక్ మాకు శత్రుదేశం కాదు!

- కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్సీ హరిప్రసాద్ వ్యాఖ్య
- అసెంబ్లీలో పాక్ అనుకూల నినాదాలపై దుమారం
- అధికార కాంగ్రెస్, బీజేపీ మధ్య తీవ్ర వాగ్యుద్ధం

బెంగళూరు: పాకిస్థాన్ బీజేపీకే శత్రు దేశమని, తమకు మాత్రం అది పొరుగు దేశమని కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్సీ బీకే హరి ప్రసాద్ బుధవారం చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. దీనిపై బీజేపీ స్పందిస్తూ కాంగ్రెస్ దేశ వ్యతిరేక భావాలకు ఆశ్రయం ఇస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేసింది. అసలు దీనికి బీజాలు మంగళవారం జరిగిన రాజ్యసభ ఎన్నికల ఫలితాల అనంతరం పడ్డాయి. రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయోత్సవాల్లో పాకిస్థాన్ అనుకూల నినాదాలు చేశారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై బీజేపీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బుధవారం బీజేపీ సభ్యులు ఈ అంశాన్ని శాసన సభలో లేవనెత్తారు. ముఖ్యమంత్రి, హోం మంత్రి స్పందిస్తూ, ఫోరెన్సిక్ నివేదిక వచ్చిన తర్వాత దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

హుస్సేన్ విజయోత్సవాల్లో

రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సయ్యద్ నాసిర్ హుస్సేన్ విజయం సాధించినట్లు ప్రకటించిన తర్వాత ఆయన మద్దతుదారులు మంగళవారం రాత్రి శాసనసభ వద్ద సంబరాలు చేసుకున్నారు. వారిలో కొందరు 'పాకిస్థాన్ జిందాబాద్' అంటూ నినాదాలు చేసినట్లు బీజేపీ, కొన్ని టీవీ చానళ్లు ఆరోపించాయి. అదేవిధంగా ఈ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేశాయి. కర్ణాటకలోని బెళగావి, చిత్రదుర్గ, మాండ్యలలో బీజేపీ బుధవారం ధర్నాలు నిర్వహించింది. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది.

దేశంలోనే ధనిక పార్టీ బీజేపీ ఆదాయంలో అగ్రస్థానం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: ఆదాయంలో దేశంలోనే ధనిక పార్టీగా బీజేపీ నిలిచింది. దేశంలోని ఆరు ప్రధాన జాతీయ పార్టీలు తమ ఆదాయాన్ని వెల్లడించాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికి 3,077 కోట్ల ఆదాయం ఉన్నట్టు తెలుపగా, అందులో కేవలం బీజేపీకే 2,361 కోట్ల ఆదాయం వచ్చిందని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) బుధవారం వెల్లడించింది. మొత్తం ఆదాయంలో బీజేపీ షేర్ 76.73 శాతం కాగా, 452.375 కోట్ల వార్షిక ఆదాయం పొంది 14.70 శాతంతో కాంగ్రెస్ రెండో స్థానంలో నిలిచింది. ఈ రెండూ కాక బీఎస్పీ, ఆప్, ఎన్‌పీపీ, సీపీఐ-ఎం పార్టీలు తమ ఆదాయాన్ని వెల్లడించాయి. 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాల మధ్య బీజేపీ ఆదాయం 23.16 శాతం పెరిగి 2360.844 కోట్లకు చేరింది. ఇదే వ్యవధిలో కాంగ్రెస్, సీపీఎం, బీఎస్పీ ఆదాయం వరుసగా 16.42, 12.68, 33.14 శాతం తగ్గుతూ వచ్చాయి.

ప్రజా సమస్యలను అర్థం చేసుకోగలిగే వారే ఉత్తమ జడ్జి

న్యూఢిల్లీ: న్యాయమూర్తులకు కేవలం చట్టబద్ధమైన అధికారం మాత్రమే సరిపోదని, మానవ జీవితాన్ని, ప్రజా సమస్యలను అర్థం చేసుకోవాలనే ఆకాంక్ష బలంగా ఉండాలని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ చెప్పారు. కొత్తగా నియమితులైన న్యాయమూర్తులు జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ, జస్టిస్ అగస్టీన్ జార్జి మసీహ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ప్రసన్న బీ వరాలేలను అభినందించేందుకు సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సీజేఐ మాట్లాడారు. సుప్రీంకోర్టులో గరిష్ఠంగా 34 మంది న్యాయమూర్తులు పని చేయవలసి ఉంటుందని, ఈ నలుగురు న్యాయమూర్తులు ఏ విధంగా నిబద్ధతతో కృషి చేశారో వారి జీవితాలు వెల్లడిస్తున్నాయని చెప్పారు. చట్టాల పట్ల పరిజ్ఞానం, వాటిని ఏ సందర్భంలో అమలు చేయాలో తెలిసి ఉండటం ముఖ్యమే అయినప్పటికీ, అంతిమంగా ప్రజా సమస్యలను అర్థం చేసుకోవడమే మనల్ని ఉత్తమ న్యాయవాదులుగా, న్యాయమూర్తులుగా తీర్చిదిద్దుతుందని చెప్పారు.

- టెక్సాస్‌లో కార్చిచ్చుల బీభత్సం

కెనడియన్ (యూఎస్): అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో కార్చిచ్చులు బీభత్సం సృష్టించాయి. ఎండుగడ్డికి గాలి తోడవడంతో కార్చిచ్చులకు మరింత ఆజ్యం పోసినట్టయింది. దీంతో వేలాది మంది నిరాశ్రయులయ్యారు. వందల ఎకరాల్లో వృక్షాలను కార్చిచ్చులు దహించివేశాయి. 60 కౌంటీలలో అత్యవసర పరిస్థితి ప్రకటించారు. విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో పలు ప్రాంతాలు అంధకారంలో చిక్కుకున్నాయి. కార్చిచ్చు నేపథ్యంలో ఓ అణు ఆయుధగారాన్ని తాత్కాలికంగా మూసివేశారు.

బరువు తగ్గుతున్న సముద్ర చేపలు!

వాతావరణ మార్పులే కారణం

న్యూఢిల్లీ: వాతావరణ మార్పుల కారణంగా సముద్రంలో ఆహారానికి పోటీ పెరిగిందని, దీంతో చేపల బరువు తగ్గుతున్నదని తాజా అధ్యయనం తేల్చింది. పశ్చిమ ఉత్తర పసిఫిక్ సముద్ర జలాల్లో 2010 దశకంలో చేపల బరువు తగ్గుదల కనపడిందని పరిశోధకులు కనుగొన్నారు. వాతావరణ మార్పులతో సముద్ర జలాలు వేడెక్కుతున్న సంగతి తెలిసిందే. దీని ఫలితంగా పోషకాహారంతో కూడిన చల్లటి జలాలు సముద్రం ఉపరితలానికి చేరటం లేదని, ఇది చేపలకు ఆహార లభ్యత తగ్గటానికి దారితీసిందని పరిశోధకులు తెలిపారు.

కు.ని. శస్త్రచికిత్స వికటించి కర్ణాటకలో ముగ్గురి మృతి

బెంగళూరు: కర్ణాటకలో దారుణం చోటుచేసుకున్నది. తుమకూరు జిల్లా పావగడ ప్రభుత్వ దవాఖానలో ఈ నెల 22న నిర్వహించిన కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు వికటించాయి. దీంతో ముగ్గురు మహిళలు మృతిచెందారు. పావగడ తాలూకాలోని రాజవంతి గ్రామానికి చెందిన అంజలి, వీర్లగొంది గ్రామానికి చెందిన అనిత, బ్యాడనూరు గ్రామానికి చెందిన నరసమ్మగా వీరిని గుర్తించారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నది. వీరిని మెరుగైన వైద్య చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. అనిత ఆపరేషన్ జరిగిన రోజే మరణించగా, మిగతా ఇద్దరూ 24న మృతిచెందారు.

వైద్య కళాశాలకు రూ.8 వేల కోట్ల విరాళం

ఇక ఫీజులుండవ్:యాజమాన్యం

న్యూయార్క్: అమెరికాలోని న్యూయార్క్‌లో ఒక వైద్య కళాశాల పంట పండింది. ఒక ధనిక దాత అనూహ్యంగా ఒక బిలియన్ డాలర్లు (సుమారు రూ.8,290 కోట్లు) విరాళంగా అందజేశారు. దీంతో ఇక నుంచి విద్యార్థుల నుంచి ట్యూషన్ ఫీజును వసూలు చేయబోమని ఐన్‌స్టీన్ కాలేజ్ ఆఫ్ మెడిసిన్ ప్రకటించింది. ఐన్‌స్టీన్ బోర్డు ట్రస్టీ చైర్మన్ రూత్ గోట్టెస్‌మన్ ఈ విరాళం అందజేసినట్టు కాలేజీ నిర్వాహకులు ప్రకటించగానే విద్యార్థులు కేరింతలు కొట్టారు. ఈ ఏడాదికి చెల్లించిన విద్యార్థుల ఫీజును వాపసు ఇస్తామని, ఆగస్టు నుంచి ఎలాంటి ఫీజును వసూలు చేయబోమని కాలేజీ యాజమాన్యం తెలిపింది.

ఏఎస్పీ కిడ్నాప్.. ఆయుధాలు వీడి పోలీసుల నిరసన

ఇంఫాల్, ఫిబ్రవరి 28: మణిపూర్ రాష్ట్రంలో కొందరు దుండగులు అదనపు ఎస్పీపై దాడి చేసి కిడ్నాప్‌నకు పాల్పడటంపై మణిపూర్ పోలీస్ కమాండోలు వినూత్నంగా నిరసన తెలిపారు. సుమారు వెయ్యి మంది కమాండోలు బుధవారం ఆయుధాలను విడిచిపెట్టి విధులకు హాజరయ్యారు. అదనపు ఎస్పీని వెంటనే విడుదల చేయకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని మైతీ, ఇతర ఉగ్రవాద సంస్థలకు ఐదు లోయ ప్రాంత జిల్లాలకు చెందిన కమాండోలు హెచ్చరించారు.

గుజరాత్‌లో

2 వేల కోట్ల డ్రగ్స్ పట్టివేత

- 3,300 కిలోల మత్తు పదార్థాల సీజ్
- ఈ స్థాయిలో పట్టుబడడం దేశంలోనే ఇదే తొలిసారి
- ఐదుగురు విదేశీయుల అరెస్ట్

పోర్‌బందర్/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: గుజరాత్ తీరంలో 3,300 కేజీల మత్తుపదార్థాలను నార్కోటిక్స్ అధికారులు సీజ్‌చేశారు. ఇంత పెద్దమొత్తంలో డ్రగ్స్ పట్టబడడం దేశంలోనే తొలిసారి. ఇరాన్ పోర్టు నుంచి పడవలో అక్రమంగా తరలిస్తున్న వీటిని పట్టుకున్న అధికారులు ఐదుగురు విదేశీయులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేకపోవడంతో నిందితులు పాకిస్థాన్ లేదా, ఇరాన్‌కు చెందినవారు అయి ఉంటారని భావిస్తున్నారు. వారి నుంచి తురాయా కంపెనీకి చెందిన శాటిలైట్ ఫోన్, నాలుగు మొబైల్ ఫోన్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఆపరేషన్ సాగర్‌మంథన్-1

అరేబియా సముద్రం మీదుగా పెద్ద ఎత్తున డ్రగ్స్ అక్రమ రవాణా జరగబోతోందంటూ కొన్ని వారాలుగా అందుతున్న సమాచారంతో నేవీ, ఎన్‌సీబీ, గుజరాత్ పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టారు. దీనికి 'సాగర్‌మంథన్-1' అని పేరు పెట్టారు. నౌకాదళం తన పీ8ఐ దీర్ఘశ్రేణి సముద్ర నిఘా విమానం, మెరైన్ కమాండోలను యుద్ధనౌక, హెలికాప్టర్లలో మోహరించింది. డ్రగ్స్ మోసుకొస్తున్న చేపల బోటును మంగళవారం ఉదయం అరేబియా సముద్రంలో భారత తీరానికి 60 నాటికల్ మైళ్ల దూరంలో, అంతర్జాతీయ సముద్ర సరిహద్దు రేఖ (ఐఎంబీఎల్) వద్ద అధికారులు అడ్డగించారు.

హెరాయిన్ ప్యాకెట్లపై పాకిస్థాన్ ముద్ర

ఈ ఆపరేషన్‌లో స్వాధీనం చేసుకున్న 3,300 డ్రగ్స్‌లో 3,110 కేజీల చరాస్ లేదా హాషిష్, 158.3 కేజీల క్రిస్టల్ మెథాంఫెటామిన్, 'రాస్ అవద్ గూడ్స్ కో, పాకిస్థాన్ ఉత్పత్తి' అని రాసి ఉన్న 24.6 కేజీల హెరాయిన్ ప్యాకెట్లు ఉన్నాయి. ఇవి ఇరాన్‌లోని చాబహార్ ఓడరేవు నుంచి రవాణా అవుతున్నట్టు ఎన్‌సీబీ తెలిపింది. పట్టుబడిన డ్రగ్స్ విలువ అంతర్జాతీయ మార్కెట్లో రూ. 1300 నుంచి రూ. 2 వేల కోట్ల వరకు ఉంటుందని ఎన్‌సీబీ డైరెక్టర్ జనరల్ ఎస్ఎన్ ప్రధాన్ తెలిపారు. దేశంలో ఇంత పెద్దమొత్తంలో డ్రగ్స్ పట్టుబడడం ఇదే తొలిసారి అని వెల్లడించారు.

మిట్టల్‌కు యూకే నైట్‌హుడ్ అవార్డు

లండన్: భారతీ ఎంటర్‌ప్రైజెస్ అధినేత సునీల్ భారతీ మిట్టల్‌కు అరుదైన గౌరవం లభించింది. బ్రిటన్ ప్రభుత్వం అందించే ప్రతిష్ఠాత్మక నైట్‌హుడ్ పురస్కారం సునీల్ మిట్టల్‌ను వరించింది. కింగ్ చార్లెస్-3 చేతుల మీదుగా నైట్‌హుడ్ అవార్డు అందుకున్న తొలి భారతీయుడిగా సునీల్ మిట్టల్ చరిత్ర సృష్టించారు. యూకే, ఇండియా మధ్య వ్యాపార సంబంధాల్లో మిట్టల్ చేసిన సేవలకు గాను ఈ అవార్డును బహుకరించారు. బ్రిటిష్ అవార్డుల జాబితాలో అత్యంత ఉన్నత పురస్కారంగా పేర్కొనే నైట్ కమాండర్ ఆఫ్ మోస్ట్ ఎక్సలెంట్ ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్ (కేబీఈ) ఒకటి. .

బైడెన్‌కు ప్రత్యామ్నాయంగా మిషెల్ ఒబామా!

వాషింగ్టన్ : నవంబర్‌లో జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్‌కు డెమొక్రాట్ల నుంచి మద్దతు కరువైంది. బైడన్‌కు బదులుగా వారంతా మాజీ ప్రథమ మహిళ మిషెల్ ఒబామాను సమర్థిస్తున్నారని ఓ సర్వేలో వెల్లడైంది. రాస్ముసేన్ రిపోర్ట్స్ విడుదల చేసిన పోల్ సర్వే డాటా ప్రకారం 48 శాతం మంది డెమొక్రాట్లు బైడెన్‌ను ప్రాతినిధ్యాన్ని వ్యతిరేకించారు. మిషెల్ అభ్యర్థిత్వానికి 20 శాతం మంది, కమలాహ్యారిస్‌కు 15 శాతం, హిల్లరీ క్లింటన్‌కు 12 శాతం మంది మద్దతు తెలిపారు.

ఫ్లయింగ్ కారుతో ట్రాఫిక్‌కు చెక్!

నేలపై నడిచే, నింగిలో ఎగిరే సరికొత్త కారు • 2025 చివరినాటికి అందుబాటులోకి

*బార్సిలోనా: ట్రాఫిక్ జామ్ కష్టాలను తీర్చేందుకు త్వరలో ఓ సరికొత్త ఎలక్ట్రిక్ ఫ్లయింగ్ కారు అందుబాటులోకి రాబోతున్నది. దాదాపు 2.35 లక్షల పౌండ్ల (దాదాపు రూ.2.46 కోట్ల)కు లభ్యమయ్యే ఈ కారు సాయంతో మీరు సైన్స్-ఫిక్షన్ సినిమాల్లో మాదిరిగా విమానంలా నింగిలో ఎగురుతూ ట్రాఫిక్ జామ్‌ల నుంచి సులువుగా బయటపడవచ్చు. అలెఫ్ ఏరోనాటిక్స్ సంస్థ రూపొందించిన ఈ ఫ్లయింగ్ కారుకు 'మాడల్-ఏ' అని నామకరణం చేశారు. మామూలు కార్ల మాదిరిగా వీధుల్లో రోడ్లపై నడవడంతో